# రెండు కోరికలు

జొన్నలగడ్డ శ్రీరామ కమల్

నగరం నడి బొడ్డో వెలసిం దా నిరాహారదీక్షా శిబిరం. శిబిరంలో నీరసంగా ఒక వ్యక్తి. అతడి మెడలో పూలదండ. అతడి చుట్టూ ఉత్సాహంగా పదిమంది. ఆ పదిమందీ ఎప్పుడూ ఉత్సాహంగానే ఉంటారు. వారి వృత్తి నిరాహారదీక్షల నేర్పాటు చేయడం. ఆ పని చేసినందుకు గానూ నగరంలోని ఒక సేవా సంస్థ వారికి అవసరానికి మించిన డ బ్బిస్తుంది.

ప్రభుత్వం పేదవారికి ఋణాల నిమ్మని బాంకుల్ని శాసిస్తుంది. బాంకు మేనేజర్లు అప్పులు తీసుకునే పేద వారికోసం వేట ప్రారంభిస్తారు. అదే విధంగా నిరాహారదీక్షా శిబిరం ఏర్పాటు చేసే ఆ పదిమందీ సమస్యలతో సతమత మయ్యేవారికోసం వేటలో ఉంటారు. వారి శిబిరం పట్టుఘని పది రోజులు ఖాళీగా ఉండకూడదని నియమం. అయితే ప్రస్తుతం వారి కే బెంగా లేదు. ఇప్పుడు నడుస్తున్న నిరాహారదీక్ష ముగిస్తే శిబిరా న్నాక్రమించడానికి మరో నలుగురు క్యూలో ఉన్నారు. ఒకడు రాజీవ్ గాంధీయే దేశానికి ప్రధానిగా ఉండాలని, ఇంకొకడు వీపీ సింగ్ ప్రధానిగా కొనసాగాలని, మరొకడు కపిల్‌దేవ్‌ను ఇండియన్ క్రికెట్ టీమ్‌కు కెప్టెన్ చేయాలని, వేరొకడు రామ జన్మభూమి సమస్యను హిందూ-ముస్లిం నాయకులు సామరస్యంతో పరిష్కరించుకోవాలని.

కానీ ఇప్పుడు జరుగుతున్న నిరాహారదీక్ష మాత్రం ఎందుకో ఎవరికీ తెలియదు. తను నిరాహారదీక్షను ప్రారంభించడానికి కారణం ఆ వ్యక్తి ప్రకటించలేదు. పైగా అతడు మౌనవ్రతాన్ని కూడా పూనాడు. దేశ ప్రధానమంత్రి స్వయంగా వస్తే తప్ప తాను మౌనవ్రతాన్ని విడనాడనని అతడు ముందే చెప్పాడు.

ఆరంభంలో అతడి నెవరూ పట్టించుకోలేదు. వారం గడిచేసరికి వార్తకు ప్రాముఖ్యం వచ్చింది. పది రోజులు గడిచేసరికి అతడికి అన్ని వార్తాపత్రికలలోనూ మొదటి పేజీలో స్థానం లభించింది.

పదకొండో రోజున రాష్ట్ర మంత్రి వెళ్ళి అతణ్ణి పలకరించాడు. అత డాయన్ను చూడలేదు. ఆ తరువాత రాష్ట్ర ముఖ్యమంత్రి వెళ్ళాడు. ప్రయోజనం లేదు. అటుపైన కేంద్ర మంత్రు లిద్దరూ ఒకరి తరువాత ఒకరు...

అన లత డెందుకు నిరాహారదీక్ష చేస్తున్నాడో కూడా ఎవరూ తెలుసుకోలేకపోయారు.

చాలామంది విలేఖరులు శిబిరం నిర్వాహకుల్ని అడిగి చూశారు.

"మాకు కుల, మత, జాతి వివక్షత లేదు. కారణాలతో నిమిత్తం లేదు. అవకాశ మున్నప్పుడల్లా అడిగిన వా రందరికీ దీక్షా శిబిరాన్ని అందుబాటులోకి తెస్తాం. అంతకు మించి మే మేమీ చెప్పలేం" అన్నారు వాళ్ళు.


పదిహేను రోజులు గడిచాయి. ఈ వార్త దేశాన్ని గ.గోళెత్తించింది. ఎవరో ఒక అనామకుడు ఎవ్వకీ తెలియని కారణం కోసం నిరాహారదీక్ష కొనసాగిస్తున్నాడు. కారణం చెప్పకుండా మౌనవ్రతం పట్టాడు. ప్రధానమంత్రి మినహా వే రెవ్వరూ అతణ్ణి మాట్లాడించలేరు.

ఇలాగైతే ఎలా? అడ్డమైన వాళ్ళూ ప్రధానితో మాట్లాడాలని నిరాహారదీక్ష ప్రారంభిస్తే ఆయన ఏం చేయగలడు? ప్రధాని ముఖ్యులతో చర్చలు జరిపాడు.

సిఐడీలు తీసిన ఆరానుబట్టి ఆ వ్యక్తి విదేశీ గూఢచారి కాదు. అతడి పేరు రామారావు. ఇంటర్మీడియేట్ ఫస్టు క్లాసులో పాసయ్యాడు. తండ్రి రిక్షా లాగుతూ ప్రమాదానికి గురై మరణించాడు. తల్లి జబ్బుతో వైద్యం లేక మరణించింది. అతడికి ఉండడానికి ఇల్లు లేదు. కానీ దేశంలో అలాంటి వాళ్ళు చాలామంది ఉన్నారు. అతడికి ఉద్యోగం కావాలనుకుంటే అందుకు నిరాహారదీక్షనే ఆశ్రయించాలా?

"అడ్డమైన వాళ్ళ గురించీ మనం పట్టించుకోకూడదు. వాడు చచ్చినా దేశానికి నష్టం రాదు" అన్నా డో ఆవేశపరుడైన ప్రజా ప్రతినిధి.

"మనిషి చావుకి ఎన్నో కారణా లుంటాయి. కానీ నా కారణంగా ఎవరూ చావకూడదు" అన్నాడు ప్రధానమంత్రి.



"వాడికి మనమేం తక్కువ చేశాం? పెద్ద పెద్ద వాళ్ళందరూ వెళ్ళి బ్రతిమాలడమైంది. అడ్డమైన వాళ్ళూ ప్రధానమంత్రితో తప్ప మాట్లాడమంటే ఇక ఆ పదవికి విలు వేముంటుంది?" అన్నా డింకో ప్రజా ప్రతినిధి.

"నిరాహారదీక్ష చేసే వాళ్ళను అడ్డమైన వాళ్ళతో కలపకూడదు. ఒకటి కాదు, రెండు కాదు - పదిహేను రోజుల్నించి తిండి లేకుండా ఉన్నాడంటే అందు కెంతో మనోనిబ్బరం కావాలి. ఆ నిబ్బరం సామాన్యులకు సాధ్యపడదు" అన్నాడు ప్రధానమంత్రి.

"మెడికల్ రిపోర్టు చదివారా? మనిషి కొద్దిగా చిక్కాడు. కాస్త నీరసంగా ఉన్నాడు. తప్పితే శరీరంలోని అన్ని అవయవాలూ సక్రమంగా పని చేస్తున్నాయి. జ్వరం వస్తే లంఖణాలు చేసినట్లుంది తప్ప నిరాహారదీక్ష చేస్తున్నట్లు లేదు. నా అనుమానం వీ డో ప్రొఫెషనల్ అని!" అన్నాడు మరో ప్రజా ప్రతినిధి.

"ఏది ఏమైనా నే నతణ్ణి కలుసుకుంటాను" అన్నాడు ప్రధానమంత్రి తన నిర్ణయాన్ని ప్రకటిస్తూ.

"వాడు కోరరానిది కోరితే?"

"ఒక సామాన్యుడి ముందు నిలబడలేకపోతే మన రాజనీతి వృథా. నే నిది సవాలుగా తీసుకుంటున్నాను" అన్నాడు ప్రధానమంత్రి.

** ** **

దీక్షా శిబిరంలో అతడు. అతడి మెడలో పూలదండ.

అతడి కెదురుగా ప్రధానమంత్రి.

శిబిరం చుట్టూ పాత్రికేయులు, టీ.వీ. అండ్ మూవీ కెమేరాలు.

ఆనాటికి నిరాహారదీక్ష ఇరవయ్యవ రోజు...

ప్రధాని చేతిలో ఫల రసమున్న గాజు గ్లాసు.

అతడి ముఖాన చెరగని చిరునవ్వు.

ప్రధాని అతడికి 'గ్లా సందించాడు. అత డందుకుని పక్కన పెట్టి - "తమరు సహృదయులు. నావంటి అనామకుణ్ణి చూడ్డానికి స్వయంగా వచ్చారు: అందుకే నోరు విప్పి మాట్లాడుతున్నాను. అయితే నా కోరికలు తీరేదాకా ఈ ఫల రసాన్ని స్వీకరించలేను. అన్యథా భావించక మన్నించండి" అన్నాడు చిరునవ్వుతో.

"దేశ క్షేమానికి భంగం కలిగించనివీ, నాకు సాధ్యపడేవీ అయితే తప్పక నీ కోరికలు తీరుస్తాను. నీవు నిరాహారదీక్ష ఎందుకు పూనావో చెప్పు" అన్నాడు ప్రధానమంత్రి సానునయంగా.



"పొరుగు దేశాల దాడి నుంచి కాపాడుకుందుకు మనం ఏటా కొన్ని వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నాం. దేశ పౌరు లందరికీ వార్తలు, విశేషాలు తెలియాలని మనం కొన్ని వేల కోట్లు ఖర్చు పెట్టి దేశ మంతటా దూరదర్శన కేంద్రాలు ఏర్పాటు చేశాం. మన దేశ సంస్కృతి విదేశాల్లో తెలియాలని కొన్ని వందల కోట్ల ఖర్చుతో విదేశాల్లో భరతోత్సవాలు జరుపుతున్నాం. వైజ్ఞానిక ప్రగతికోసం పరిశోధన సంస్థలు నెలకొల్పి సంపన్న దేశాలతో పోటీ పడుతున్నాం. ఇబ్బందుల్లో ఉన్న పొరుగు దేశాలకు, బడుగు దేశాలకు సైనికంగానూ, ఆర్థికంగానూ కూడా సాయపడుతున్నాం. ఇన్ని చేయగల మన దేశ ప్రధానిగా మీకు నా రెండు కోరికలూ అసాధ్యం కాకూడదనే నా నమ్మకం" అన్నా డతను.

"నీ కోరి కేమిటో చెప్పు..." అన్నాడు ప్రధానమంత్రి.

"కోరిక కాదు... కోరికలు.. రెండంటే రెండు..."

"ఊఁ..." అన్నాడు ప్రధానమంత్రి.

"నేను సామాన్యుణ్ణి. ఇంటర్మీడియేట్ ఫస్టు క్లాసులో పాసయ్యాను. డబ్బు లేక పై చదువులకు వెళ్ళలేదు. అప్పుడే నా తండ్రి పోయాడు. నేను ఉద్యోగానికి ప్రయత్నించాను. కానీ నాకు ఉద్యోగం దొరకలేదు. వెనుకబడిన తరగతికి చెందని కారణంగా రిజర్వేషన్లోనూ నాకు ఉద్యోగం దొరకలేదు. చిన్నప్పట్నించీ బక్కపలచగా ఉండే నా శరీరం కాయకష్టానికి అనుకూలించదు. మందు లిప్పించలేక నా తల్లిని పోగొట్టుకున్నాను. ఆ తరువాత... ఆకలి... ఆకలి... అదే నాకు తెలిసింది. ఎంత కష్టపడ్డా ఎప్పుడో ఒక రోజు కాస్త ఆకలి తీరేది. నా శరీరం ఆకలి బాధను ఓర్చుకోవడం అలవాటు చేసుకుంది. ఆహారం లేకుండా రోజుల తరబడి మనగలగడం నేర్చుకుంది..."

"నీ కోరికలు చెప్పు..." అన్నాడు ప్రధానమంత్రి.

"మీ రేం చెబితే అది చేస్తాను. నాకు తిండి కావాలి. ఈవేళ్టికి కాదు, రేపటికి కాదు. రోజూ తిండి కావాలి... ఇదీ నా మొదటి కోరిక..." అగా డతడు.

"తిండి కావాలని నిరాహారదీక్ష చేస్తున్నావా?" ప్రధాని ముఖంలో ఆశ్చర్యం!

"నేను నిరాహారదీక్ష ప్రత్యేకంగా చేయడం లేదు. అది నా నిత్యకృత్యం. అది తప్ప నా కింకో దారి లేదు. నా చుట్టూ ఈ శిబిర ముంది కాబట్టి నే నాకలితో మల మల మాడుతూంటే దానికి నిరాహారదీక్ష అన్న పేరు వచ్చి దేశ రాజధానినుంచి ప్రధాని కదలి రావడం జరిగింది..."

"నీ రెండో కోరి కేమిటో చెప్పు..."

అతడు తన పక్కనుంచి ఓ లావుపాటి బౌండ్ నోట్ బుక్ ప్రధానికి అందించి - "ఇందులో లక్షా ఇరవై రెండు వేల పే ర్లున్నాయి. వా ళ్ళందరికీ ఇలాంటి నిరాహారదీక్షా శిబిరాలు ఏర్పాటు చేయండి. పాపం, వాళ్ళూ నాకులాగే చాలాకాలంగా నిరాహారదీక్షలో ఉన్నారు. కానీ శిబిరాలు లేక వారికి గుర్తింపు రావడంలేదు" అని "వా రందరికీ శిబిరాలు కట్టించడం, అలాంటి వారింకా ఉంటే ఈ జాబితలో చేర్చడం నా రెండవ కోరిక" అన్నాడు.

ప్రధానమంత్రి ఆ నోట్ బుక్‌ను పక్కన పెట్టి రెండు చేతులూ జోడించి అతడికి నమస్కరించి - "నీవు సామాన్యుడివి కాదు, మహానుభావుడివి" అన్నాడు.

అతడు వెంటనే తనూ చేతులు జోడించి ప్రధానికి నమస్కరించి - "సామాన్యుడిలో మహానుభావుణ్ణి చూసి చేతులు జోడించేవారు నాకు ఎన్నికల సమయంలో తటస్థపడుతూనే ఉంటారు. సామాన్యుణ్ణి సామాన్యుడిగా గుర్తించి వాడికి సాయపడే మహానుభావులకోసం నే నెదురు చూస్తున్నాను. ఆ మహానుభావుడు మీరే అయితే ఈ ఫలరసం స్వీకరించగలను..." అన్నాడు.

అతడు ఫలరసం స్వీకరిస్తాడా?

ఈ ప్రశ్నకు వచ్చే సమాధానంపైన మన దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంది. ★